APTEL/2009/29308

# స్నేహిత ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

23-08-2026
**ఆదివారం**
**హైదరాబాద్**
సంపుటి: 17 । సంచిక: 300
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



**చిన్న సమస్యలకూ రిఫర్ చేస్తే కఠిన చర్యలు** 2




## ఎడ్యుకేషన్, రీసెర్చ్

# ప్రోగ్రామ్‌లు పెట్టాలి

- హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేయాలి
- లండన్ కేంబ్రిడ్జ్, లండన్ వర్సిటీలను సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం
- విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో చర్చ
- ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను వివరించిన సీఎం
- తెలంగాణకు ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకురావడమే లక్ష్యమన్న రేవంత్ రెడ్డి

**లండన్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** లండన్‌లోని ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ , లండన్ వర్సిటీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్ , రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరారు. యువపారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పష్టమైన కార్యచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఇరువర్గాలు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్‌లు హాజరయ్యారు. మరోవైపు సీఎం రేవంత్ పర్యటనకు కేంద్రం నో చెప్పడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పు పట్టారు...

మిగతా2లో...



## 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం



- రాష్ట్రం పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా మారింది
- పరిశ్రమలకు నిరంతర విద్యుత్, నీటి కొరత లేకుండా చూస్తాం
- పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీస్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2

## జీవో 97ను వెంటనే రద్దు చేయాలి

- పాలిటెక్నిక్ వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు
- ఐటీఐలతో విలీనం చేసే నిర్ణయాన్ని తక్షణమే పసంహరించుకోవాలి
- రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యాసంస్థలకు ఏడు దశాబ్దాల సుదీర్ఘమైన చరిత్ర ఉంది
- ఎంతో మంది నిరుపేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి దేశ విదేశాల్లో స్థిరపడ్డారు
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

2



### వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన

## న్యాయ వ్యవస్థలే వెన్నెముక

- ఢిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- న్యాయనామిక్స్, న్యాయ సేతు అనే పదాలను పరిచయం చేసిన ప్రధాన న్యాయమూర్తి



2

### కాళేశ్వరంపై సమగ్ర శాస్త్రీయ

## అధ్యయనం అవసరం

- ప్రతి అంశాన్ని సాంకేతిక పరిశీలన ద్వారా నిర్ధారించాల్సిన అవసరం ఉంది
- ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టు విషయంలో వాస్తవాలు ప్రజలకు తెలియాలి
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



2

విలేకరులు కావలెను

స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

Contacts
తెలంగాణ
95500 21491

# ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

**ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లివర్‌పూల్ ఆసక్తి ..**

లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు లండన్‌లోని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగం ఆసక్తి చూపింది. భాగస్వామ్య ఒప్పందం చేసుకునేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్ రానుంది. లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇవాళ లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు.



**తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి..**

లండన్‌లోని ప్రఖ్యాత ఇంపీరియల్ కాలేజీని సీఎం సలహాదారు రామకృష్ణారావు సందర్శించారు. ఇంపీరియల్ కాలేజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, అమాండా వోల్టుయిజెన్, దక్షిణాసియా సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో రామకృష్ణారావు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. పరిశోధన రంగంలో భాగస్వామ్యం విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపారు. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను రామకృష్ణారావు ఆహ్వానించారు.

**కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటోంది..**

సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటన ఆదివారంతో పూర్తవ్వనుంది. ఆయన అమెరికా పర్యటనకు కేంద్రం నో చెప్పడంతో లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. పెట్టుబడుల కోసం వెళ్లే పర్యాటనలను అడ్డుకోవడం ముమ్మాటికీ అన్యాయమేనని ఆయన అభిప్రాయపడ్డారు. బీజేపీ పెద్దలు తమకు కావాల్సిన వారికి అనుమతి ఇస్తారని, తెలంగాణ సీఎంకు మాత్రం విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు.అమెరికాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, పెట్టుబడులు వస్తే తెలంగాణతో పాటు దేశానికి కూడా లాభమేనన్నారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి పర్యటనలను అడ్డుకుంటోందని ఖర్గే ఆరోపించారు. ముఖ్యమంత్రులు వెళ్లి పెట్టుబడులు తెస్తారనే భయం వారిలో ఉందన్నారు. అన్నీ తమ ద్వారా జరగాలనేది కేంద్రం సంకుచిత ఆలోచన అని ఖర్గే విమర్శించారు.

**లండన్ యూనివర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్..**

హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు లండన్ యూనివర్సిటీ ప్రతినిధులు సీఎంకు తెలిపారు. లండన్ యూనివర్సిటీ ప్రతినిధులు అక్కడి సెనేట్ హౌస్‌లో సీఎం రేవంత్ రెడ్డి బృందంతో చర్చించింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ ప్రతినిధి బృందాలు కూడా పాల్గొన్నాయి. యూనివర్సిటీకి చెందిన వివిధ స్కూళ్లు, విభాగాల ద్వారా ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు అందించేలా హైదరాబాద్‌లో క్యాంపస్‌ను ఏర్పాటుకు యోచిస్తున్నట్టు యూనివర్సిటీ ప్రతినిధులు వివరించారు.లండన్ యూనివర్సిటీకి చెందిన వివిధ విద్యా విభాగాలను ఒకే అకడమిక్ ఫెడరేషన్‌గా అనుసంధానించే విధంగా ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయని చెప్పారు. అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించినందున.. సీఎం రేవంత్‌రెడ్డి లండన్ పర్యటన ఇవాళ ముగించుకొని హైదరాబాద్ బయలుదేరనున్నారు. సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ జయేష్ రంజన్ తదితరులు అమెరికా వెళ్లి హార్వర్డ్, ఎంఐటీ, నార్త్ ఈస్టర్న్, వర్జీనియా టెక్ వంటి ప్రముఖ యూనివర్సిటీలను సందర్శించి పలు ఎంవోయూలు చేసుకోనున్నారు.

## కాళేశ్వరంపై సమగ్ర శాస్త్రీయ అధ్యయనం అవసరం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తు భద్రతపై ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా సమగ్ర శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీలో వెలుగుచూసిన నిర్మాణపరమైన సమస్యలు కేవలం ఒక బ్యారేజీకి సంబంధించిన అంశంగా చూడకుండా.. ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం దీర్ఘకాలిక భద్రత, నాణ్యత, జవాబుదారీతనానికి సంబంధించిన అంశంగా పరిశీలించాల్సి ఉందన్నారు. శనివారం మీడియాతో మాట్లాడిన మంత్రి.. మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాక్‌లోని పియర్స్‌పై నిర్వహించిన కాంక్రీటు నాణ్యత పరీక్షల్లో ఆందోళనకర ఫలితాలు నమోదయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి అంశాన్ని సాంకేతిక పరిశీలన ద్వారా నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. "కాళేశ్వరం తెలంగాణ ప్రజల ఆస్తి. ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టుకు నష్టం ఎందుకు జరిగింది? నిర్మాణంలో ఎక్కడ లోపం జరిగింది? భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఏ చర్యలు తీసుకోవాలి? అనే అంశాలపై వాస్తవాలు ప్రజలకు తెలియాలి" అని మంత్రి పేర్కొన్నారు.

**సీఎం టూర్ వ్యక్తిగతం కాదు..**

సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను రద్దు చేయడంపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చేపట్టిన అమెరికా పర్యటన వ్యక్తిగతం కాదని, తెలంగాణకు విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టిన అధికారిక పర్యటన అని స్పష్టం చేశారు. "ప్రపంచ ప్రఖ్యాత విద్యా, నైపుణ్య, పరిశోధనా సంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావడం, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలను పెంచడం, తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. అలాంటి లక్ష్యంతో చేపట్టిన పర్యటనకు రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించారనే భావన ప్రజల్లో కలగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదు" అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వ్యాఖ్యానించారు.

## చిన్న సమస్యలకూ రిఫర్ చేస్తే కఠిన చర్యలు


**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సాధారణ ఆరోగ్య సమస్యలకు కూడా రోగులను పెద్దాసుపత్రులకు రిఫర్ చేసే పద్ధతి మారకపోతే కఠిన చర్యలు తప్పవని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ), ఏరియా, జిల్లా ఆసుపత్రులను బోధనాసుపత్రులతో సమానంగా మేజర్ సర్జరీలు చేసే స్థాయికి తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (డీఎస్‌హెచ్) పరిధిలోని ఆసుపత్రుల పనితీరుపై శనివారం హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, డీసీహెచ్‌ఎస్‌లతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బోధనాసుపత్రుల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించగా, జిల్లా, ఏరియా, సీహెచ్‌సీల్లో ఏకంగా 1,616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను రిక్రూట్ చేసినట్లు మంత్రి తెలిపారు. వైద్యులు, పరికరాలు పూర్తిస్థాయిలో ఉన్నప్పటికీ చిన్న సమస్యలకు పై ఆసుపత్రులకు పంపడం వల్ల రోగులపై ఆర్థిక భారం, టెర్షియరీ ఆసుపత్రులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యవసరమైతే తప్ప రిఫర్ చేయొద్దని, ఒకవేళ పంపాల్సి వస్తే ముందుగానే సంబంధిత ఆసుపత్రి వైద్యులకు సమాచారం ఇచ్చి సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.

**వారానికోసారి ఆకస్మిక తనిఖీలు...**

డీసీహెచ్‌ఎస్‌లు కార్యాలయాలకే పరిమితం కాకుండా వారానికి కనీసం ఒకరోజు ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మందుల లభ్యత, టెస్టులు, బయోమెడికల్ వేస్ట్ నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించి ప్రతినెలా వర్క్ రిపోర్ట్ సమర్పించాలన్నారు. అవసరమైన ఆసుపత్రుల్లో సీటీ స్కాన్లు, ఇతర డయాగ్నస్టిక్ పరికరాల ఏర్పాటుకు రోగుల సంఖ్య, వినియోగ సామర్థ్యం ఆధారంగా స్పష్టమైన నివేదికలతో ప్రతిపాదనలు పంపాలన్నారు. విధులకు ఆలస్యంగా రావడం, ముందే వెళ్లిపోవడం, నిర్లక్ష్యం వహించే డాక్టర్లు, సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని... నీటి సరఫరా, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వంటి నిర్వహణ సమస్యలు పెద్దవి కాకముందే స్థానిక అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని అన్నారు.

## జీవో 97ను వెంటనే రద్దు చేయాలి

**నంగునూరు, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పాలిటెక్నిక్ కళాశాలలను ఐటీఐలతో విలీనం చేసే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్రంలో సాంకేతిక విద్యా వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేలా తీసుకొచ్చిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పాలిటెక్నిక్ కళాశాలలను ఐటీఐలతో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రాజ్‌గోపాల్‌పేట్ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న హరీశ్‌రావు అక్కడికి చేరుకుని విద్యార్థులను కలుసుకుని వారి ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. "నేను కూడా పాలిటెక్నిక్ విద్యార్థినే. ఆ చదువుల ప్రాముఖ్యత, విద్యార్థులు పడే కష్టాలు నాకు బాగా తెలుసు" అని అన్నారు. రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యాసంస్థలకు ఏడు దశాబ్దాల సుదీర్ఘమైన, ఘనమైన చరిత్ర ఉందని, ఈ విద్య ద్వారా ఎంతో మంది నిరుపేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి దేశ విదేశాల్లో స్థిరపడ్డారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సుమారు 95 శాతం మంది నిరుపేద కుటుంబాలకు చెందినవారేనని హరీశ్‌రావు తెలిపారు. నామమాత్రపు ఫీజులతోనే డిప్లొమా స్థాయిలో నాణ్యమైన సాంకేతిక, ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే అవకాశం వారికి లభిస్తోందన్నారు. పాలిటెక్నిక్ విద్యను ఐటీఐ వ్యవస్థలో కలిపితే దాని ప్రత్యేకత, స్థాయి కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్ కోర్సుల్లో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందే అవకాశం ఉందని, ఈ విధానాన్ని భవిష్యత్తులోనూ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఐటీఐలతో విలీనం చేస్తే ఇంజనీరింగ్‌లో ప్రవేశానికి సంబంధించిన ప్రస్తుత అవకాశాలు దెబ్బతిని, విద్యార్థులు మళ్లీ ఇంటర్మీడియట్ చదవాల్సిన పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. దీంతో ముఖ్యంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. ముందస్తు అభిప్రాయ సేకరణ లేకుండానే నిర్ణయం ఎలాంటి ముందస్తు అభిప్రాయ సేకరణ లేకుండా, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, మేధావులతో చర్చించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని హరీశ్‌రావు విమర్శించారు. కనీస విధివిధానాలను కూడా స్పష్టంగా వెల్లడించకపోవడంతో విద్యార్థులు తమ భవిష్యత్తుపై అయోమయానికి గురవుతున్నారని అన్నారు. పటిష్టమైన పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను తెలంగాణ విద్యాశాఖ పరిధి నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి మార్చే ప్రయత్నం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. దీనివల్ల నిరుపేద విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను ఇతర శాఖల పరిధిలోకి మార్చే ప్రతిపాదనలు, బిల్లులను ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఏఐసీటీఈ ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే, ఎస్‌బీటీఈటీ బోర్డు పర్యవేక్షణలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు కొనసాగాలని స్పష్టం చేశారు. జీవో 97ను రద్దు చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి లేఖ రాశానని, అసెంబ్లీలో కూడా విద్యార్థుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. సిద్దిపేట ఉమెన్స్ పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాటానికి బీఆర్‌ఎస్ పార్టీ, ఆ పార్టీ విద్యార్థి విభాగం పూర్తి అండగా ఉంటుందని హరీశ్ రావు ప్రకటించారు. పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను పాత విధానంలోనే యథాతథంగా కొనసాగించే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం పై తమ పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు.



### పెట్టుబడులకు
## తెలంగాణే ఉత్తమ గమ్యస్థానం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ రాష్ట్రాన్ని పెట్టుబడుల కేంద్రంగా ఎంచుకోవాలని ప్రపంచ వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో నిర్వహించిన 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్-2026'లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, యువశక్తి, పారదర్శక పాలన అనే నాలుగు స్తంభాలపై తెలంగాణ పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్‌తో ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని నిలపడమే లక్ష్యమన్నారు. 2025-26లో రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17.82 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నామని, జాతీయ వృద్ధి రేటు 8 శాతంతో పోలిస్తే తెలంగాణ 10.7 శాతం వృద్ధి నమోదు చేయడం రాష్ట్ర ఆర్థిక పటిష్టతకు నిదర్శనమని వివరించారు.

**అభివద్ధి హైదరాబాద్ కే పరిమితం కాకుండా..**

అభివృద్ధి హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకూ విస్తరించాలనే లక్ష్యంతో రాష్ట్రాన్ని క్యూర్ (అర్బన్/ఐటీ), ప్యూర్ (పరిశ్రమలు/లాజిస్టిక్స్), రేర్ (వ్యవసాయం/గ్రామీణ పరిశ్రమలు) అనే మూడు విభాగాలుగా విభజించి ప్రణాళికలు అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ వంటి ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ అపారమైన అవకాశాలున్నాయన్నారు. పరిశ్రమలతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ చైన్లు, వేర్‌హౌసింగ్, సాగునీటి నిర్వహణలో డ్రోన్లు, ఏఐ సాంకేతికత రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టాలని ఉత్తమ్ ఆహ్వానించారు. స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్న డాక్టర్ జె.ఎ. చౌదరి, ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ కృషిని ఈ సందర్భంగా అభినందించారు.

## కేసీఆర్ సంకల్పానికి మరో ముందడుగు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు ఐటీ రంగాన్ని విస్తరించాలన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పానికి ఆదిలాబాద్ ఐటీ టవర్ మరో ముందడుగు అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఐటీ టవర్ సిద్ధమైన నేపథ్యంలో, హైదరాబాద్‌కు సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదిలాబాద్‌లోనూ ఐటీ పరిశ్రమ విస్తరించే అవకాశం ఏర్పడిందన్నారు. త్వరలో ప్రారంభం కానున్న ఆదిలాబాద్ ఐటీ టవర్ ద్వారా ఆదిలాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల యువతీ యువకులకు స్థానికంగానే ఉద్యోగావకాశాలు లభించాలని కేటీఆర్ ఆకాంక్షించారు. తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ కంపెనీలను తీసుకెళ్లాలనే లక్ష్యంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ టవర్ల నిర్మాణాలు చేపట్టామని ఆయన తెలిపారు. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి ప్రముఖ ఐటీ కంపెనీలను ఆకర్షించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే వరంగల్, సిద్దిపేట, సూర్యాపేట, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, కరీంనగర్ నగరాల్లో ఐటీ టవర్లు ప్రారంభమయ్యాయని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే, ప్రస్తుతం ఈ ఐటీ టవర్ల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతున్నదనే వార్తలు వస్తున్నాయని ఆయన అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఐటీ టవర్లలో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని, మరిన్ని ఐటీ కంపెనీలను ఆకర్షించే చర్యలు చేపట్టాలని కోరారు. స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కేటీఆర్ సూచించారు.

## భూభారతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి దండుకోగా.. కాంగ్రెస్ హయాంలో అది లక్షలాది ఎకరాలకు చేరిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. "రాత్రికి రాత్రే ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న భూములను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు? ప్రజల వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం సీఎం ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చారా? ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నవ్వులపాలైంది. బీఆర్‌ఎస్ 10శాతం కమీషన్ తీసుకుంటే.. కాంగ్రెస్ 30 శాతం తీసుకుంటోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఓపెన్ భూములను అమ్మాలని చూస్తున్నారు. ప్రైవేటు భూముల్లో 50శాతం కమీషన్ అడుగుతున్నారు. ప్రభుత్వ భూముల్ని ఎందుకు అమ్ముతున్నారో సమాధానం చెప్పాలి. రియల్ ఎస్టేట్ కంపెనీలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక ఈ భూములపై మళ్లీ పరిశీలన చేస్తాం. ఎమ్మెల్యేకు ఇష్టంలేకపోతే ఆ భూమి 22ఏలోకి వెళ్లిపోతుంది. ఈ భూముల విషయంలో భాజపా లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోంది. ప్రాముఖ్యతను బట్టి ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తారు. విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ హయాంలో ఉన్న నిబంధనలే ఇప్పుడూ ఉన్నాయి" అని కిషన్ రెడ్డి అన్నారు.

## ఏఐ వల్ల సైబర్ నేరాలు పెరిగే ముప్పు
### హైకోర్టు సీజే జస్టిస్ ఏకే సింగ్

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడకం పెరిగేకొద్దీ సైబర్ నేరాలు మరింత విస్తరించే ప్రమాదం ఉందని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'సమకాలీన చట్టపరమైన, నియంత్రణ సమస్యలు' అనే అంశంపై జరిగిన ప్రత్యేక సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఏఐ వల్ల డేటా ట్రాన్స్‌ఫార్మేషన్ వేగంగా జరుగుతోందని, నేరాల విచారణలో కొత్త కొత్త సవాళ్లు ఎదురువుతున్నాయని తెలిపారు.

## 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో టీజీఎస్ పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'పవర్ ఎగ్జిబిషన్-2026'ను శనివారం ఆయన ప్రారంభించారు. విద్యుత్ శాఖ చేపట్టిన సంస్కరణలు, ఆధునిక సాంకేతికతపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రం పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా మారిందని, పరిశ్రమలకు నిరంతర విద్యుత్, నీటి కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దేశ వ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీస్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. రాష్ట్రంలో పీక్ డిమాండ్ గతంలో 13 వేల మెగావాట్ల నుంచి ప్రస్తుతం 18 వేల మెగావాట్లకు పైగా పెరిగినప్పటికీ, ముందస్తు ప్రణాళికలు, పటిష్టమైన ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ కారణంగా ఎక్కడా అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. థర్మల్ విద్యుత్‌తో పాటు సోలార్, హైడల్, పంప్‌డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్ వంటి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్నామని భట్టి తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు 1912 టోల్ ఫ్రీ సేవలు, 'పవర్ అంబులెన్స్'ను విస్తరిస్తున్నామని చెప్పారు. ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహించే విద్యుత్ సిబ్బంది సంక్షేమం కోసం రూ.కోటి ప్రమాద బీమాను కల్పించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## వారాహి సిల్క్స్, సిల్వర్ జ్యువెలరీని ప్రారంభించిన
# మీనాక్షి చౌదరి, హీరో తేజ సజ్జ



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ప్రముఖ వస్త్ర, ఆభరణాల బ్రాండ్ వారాహి విస్తరణలో భాగంగా వారాహి సిల్క్స్ 6.0, వారాహి సిల్వర్ జ్యువెలరీ 2.0 లను వనస్థలిపురం క్రాస్ రోడ్‌లో హీరోయిన్ మీనాక్షి చౌదరి, హీరో తేజ సజ్జ కలిసి ప్రారంభించారు. వారాహి డైరెక్టర్లు మణిదీప్ యేచూరి, డా. స్పందన గారి మార్గదర్శకత్వంలో, నాణ్యత, ప్రత్యేక డిజైన్లు, సంప్రదాయం, ఆధునిక షాపింగ్ అనుభవాన్ని వినియోగదారులకు చేరువ చేయాలనే లక్ష్యంతో సంస్థ తన విస్తరణను కొనసాగిస్తోందని నిర్వాహకులు తెలిపారు. వనస్థలిపురంతో పాటు దగ్గరలోని పరిసర ప్రాంతాల వినియోగదారులకు వారాహి కలెక్షన్లు మరింత చేరువ చేసేందుకు వనస్థలిపురంలో తాము ఈ శాఖను ఎంచుకున్నట్లు, జూబ్లీ హిల్స్‌లో ప్రారంభమైన వారాహి సిల్క్స్ ప్రస్థానం అనంతరం కూకట్‌పల్లి, పాట్నీ, నెల్లూరు, విజయవాడలకు విస్తరించింది. ఇప్పుడు వనస్థలిపురంలో ఆరో స్టోర్ ప్రారంభంతో బ్రాండ్ తన విస్తరణను కొనసాగిస్తోందన్నారు. కొత్త స్టోర్‌లో కాంచీపట్టు, బనారసీ, బ్రైడల్, వెడ్డింగ్, ఫెస్టివ్, ట్రెడిషనల్ మరియు కాంటెంపరరీ చీరలు విస్తృత శ్రేణి అందుబాటులో ఉంటుంది. నాణ్యత, నైపుణ్యమైన నేసుకళ మరియు ప్రత్యేక డిజైన్లకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతి సందర్భానికి అనువైన కలెక్షన్లను వినియోగదారులకు అందించనున్నారు.

## వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక

**నేషనల్ బ్యూరో:** స్థిరమైన ఆర్థిక వృద్ధి కేవలం భౌగోళిక లేదా ముడి సహజ వనరులపై మాత్రమే కాకుండా సంస్థాగత స్థిరత్వం, విశ్వాసం, సామర్థ్యంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. బ్రిక్స్ ప్లస్ దేశాలు మానవాళిలో 40శాతానికి పైగా, ప్రపంచ పీపీపీ ఉత్పత్తిలో దాదాపు 40శాతం వాటాను కలిగి ఉన్నాయని చెప్పారు. వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక అని పేర్కొన్నారు. ఈ క్రమంలో చట్టబద్ధమైన పాలనకు సంబంధించిన 'న్యాయనామిక్స్', 'న్యాయసేతు' అనే పదాలను పరిచయం చేశారు.సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శనివారం ఢిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 'న్యాయ సేతు' (న్యాయ వారధి), 'న్యాయఆర్థిక శాస్త్రం' (న్యాయనామిక్స్) అనే కాన్సెప్ట్‌లను పరిచయం చేశారు. బ్రిక్స్ ప్లస్ దేశాలలో చట్టపరమైన, ఆర్థిక శక్తిని ఏకీకృతం చేసేందుకు 'న్యాయనామిక్స్', 'న్యాయ సేతు' దార్శనికత గురించి వివరించారు. 'బహుధ్రువ ప్రపంచంలో చట్టబద్ధ పాలన' అనే అంశంపై జరిగిన ప్రారంభ ప్లీనరీలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

**బ్రిక్స్ పరస్పర సహకారం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగింది'..**

బ్రిక్స్ దేశాల మధ్య బలమైన న్యాయ సహకారం అవసరాన్ని బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్. నాగానంద్ కూడా నొక్కి చెప్పారు. బ్రిక్స్ ఏర్పడినప్పుడు దాని ప్రధాన దృష్టి సభ్య దేశాల మధ్య ఆర్థిక, ద్రవ్య సహకారాన్ని బలోపేతం చేయడంపైనే ఉందని పేర్కొన్నారు. సంవత్సరాలుగా బ్రిక్స్ పరస్పర సహకారం, భాగస్వామ్యం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగిందని గుర్తు చేసుకున్నారు. దీంతో ఆర్థిక సంబంధాలతో పాటు చట్టపరమైన సంబంధాలు కూడా అనివార్యంగా బలపడతాయని తెలిపారు.

**భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు**

2012, 2016, 2021లలో భారత్ బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించింది. 2026లో నాలుగోసారి ఈ శిఖరాగ్ర సదస్సుకు అధ్యక్షత వహించనుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ న్యాయ ప్రముఖుల నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తంతో ఇండియా బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించనుంది. కాగా, బ్రిక్స్ కూటమిలో 2024లో ఇరాన్‌తోపాటు ఈజిప్టు, ఇథియోపియా, యూఏఈ దేశాలు చేరాయి. 2025లో ఇండోనేసియా కూడా బ్రిక్స్ కూటమిలో భాగమైంది. దీంతో ప్రస్తుతం పూర్తిస్థాయి బ్రిక్స్ సభ్యదేశాల సంఖ్య 11కు చేరుకుంది.